క్లుప్తంగా

25న కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనం ఇస్తూ జీతాలు పెంచాలని ఈ నెల 25న కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ, జిల్లా ఇంచార్జ్ కేవై దివాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని అన్ని డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు.

రక్తదానం

వైవీయూ : ప్రాణం విలువ తెలిసిన 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం ఆర్‌టీసీ బస్టాండు సమీపంలో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 2వ రోజు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వర్ణలత, శాంతి అనే ఇద్దరు మహిళలు సైతం రక్తదానం చేయడం విశేషం. కార్యక్రమంలో బ్లడ్ టు లివ్ సంస్థ ప్రతినిధులు తోట కల్యాణ్, పల్లా జయకృష్ణ, తోట మోహన్‌సాయి, రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రస్సెల్, జయచంద్రారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: మే డే ఉత్సవాలను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు కల్పన, చంద్రశేఖర్, కొండమ్మ, సుబ్బలక్ష్మీ, శోభారాణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామం శనివారం చిన్నారుల నృత్య గీతాలతో కొత్త శోభను సంతరించుకుంది. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమంగా మిస్బా మూవీ పర్యవేక్షణలో ఎస్.కె., ఆర్.కె. డాన్స్ అకాడమీ తమ ప్రతిభను చాటుకునేందుకు పలు గీతాలకు ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఏఓ పి.శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సుబ్రమణ్యేశ్వరుడికి ..

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరుడికి వెండి జంధ్యం సమర్పించారు. శనివారం అనంతపురం జిల్లా సింగనమల గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణశర్మ, నాగమ్మ దంపతులు రూ.60వేలు విలువ చేసే ఈ అభరణాన్ని ఆలయ అర్చకులు శేషగిరిరావుకు అందించారు. అంతేకాక కృత్తిక నక్షత్రం (స్వామివారి పుట్టినరోజు) సందర్భంగా అభిషేకం, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఐదుగురికి గాయాలు

మైదుకూరు: పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆటో, మినీ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఐదుగురు గాయపడ్డారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన వారు మైలవరం మండలంలోని ఆంజనేయస్వామి క్షేత్రానికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. ఆటో ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువ సమీపంలోకి రాగానే ప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చిన మినీ లారీ ఢీకొంది. ఆటో పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కమలాదేవి, స్వర్ణలత, సాయి లిఖిత, శివప్రసాద్ అనే వారితో పాటు మోక్షిణి అనే రెండేళ్ల బాలుడు గాయపడ్డారు. తాము గాయాలతో హాహాకారాలు చేస్తున్నా మినీ లారీ ఆపకుండా వెళ్లినట్లు బాధితులు తెలిపారు. కాగా స్థానికులు గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినం

– ఈద్గాలు, మసీదుల్లో భక్తుల సందడి

కడప కల్చరల్ : కడప నగరంలో ముస్లిం భక్తులు శనివారం రంజాన్ ప్రత్యేక ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గుర్రాలగడ్డలోని మజిదే హాజీరాబిలో బెంగాల్‌కు చెందిన మతగురువు మహమ్మద్ షఫీ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో ఈదుల్‌ఫితర్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి పండుగ విశేషాలను వివరించి దైవవాక్యాలను తెలిపారు. మసీద్ ముతవల్లీ పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్ తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

షాహీ ఈద్గాలో..

కడప నగరం ఆలంఖాన్‌పల్లె దగ్గర గల దండు షాహీ ఈద్గాలో ముతవల్లి మురాదియా పీఠాధిపతి సయ్యద్‌షా జమాలుల్లాబాషా సాహెబ్ భక్తులతో రంజాన్ సామూహిక ప్రత్యేక ప్రార్థనలను నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయన రంజాన్ పండుగ వెనుక గల దైవసందేశాన్ని వివరించారు. ఆయన సోదరుడు అక్మల్ పీరా మురాది పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం ప్రముఖులు, ముస్లిం భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బుఖారియా మసీదులో..

స్థానిక రవీంద్రనగర్‌లోని బుఖారియా మసీదులో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి ఈదుల్ ఫితర్ సందేశం అందించి ప్రార్థనలు నిర్వహింపజేశారు. ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రముఖులు, భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అహెలే హదీస్ ఆధ్వర్యంలో..

మాచుపల్లె అహలే హదీస్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు దైవ సందేశం అందజేశారు. మానవులందరిలో శాంతి, సామరస్యం, సోదరభావం పెరిగి కలిసిమెలిసి జీవించాలన్నారు. ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.

జామియా కళాశాలలో..

కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహాత్ అరబిక్ కళాశాల ప్రాంగణంలో మత గురువులు ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా పరస్పరం ప్రేమానురాగాలు, శాంతి సహకారాలతో జీవించాలన్నారు. ఒకరికొకరు అన్నట్లు జీవించినపుడే శాంతియుత సమాజం ఏర్పడుతుందని, దేశ పాలకులు క్షేమంగా ఉండి దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రార్థనల్లో నగర ప్రముఖులు పాల్గొన్నారు.

మజీద్ ఏ కూబాలో.. రామాంజనేయపురం సాగర్ కాలనీలోని మజీద్ ఏ కూబాలో మతగురువు ఫజిల్ లతుస్ షేక్ తహజీబుల్ అక్లాకి మదనీ పండుగ సందేశాన్నిచ్చారు. ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.



రంజాన్ పర్వదినం సందర్భంగా దైవ సందేశం అందజేస్తున్న మతగురువు



కడప నగర శివార్లలో రంజాన్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



మజీదే బుకారియాలో ...



హుస్సేనియా మసీదులో..



గుర్రాలగడ్డ మసీదులో ...

నగరంలో అధునాతన వైద్యసదుపాయం



మ్యాక్స్ హాస్పిటల్ ప్రారంభిస్తున్న మేయర్ సురేష్ బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి , తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలో అధునాతన వైద్య సదుపాయం అందుబాటులోకి వచ్చిందని నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. శనివారం స్థానిక ఎర్రముక్కపల్లిలో మ్యాక్స్ హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలోని అన్ని ముఖ్యమైన సున్నితమైన భాగాల సమస్యల చికిత్సకు ఇందులో అధునాతన వైద్యులతో పాటు వైద్యపరికరాలు కూడా అందుబాటులో ఉండడం విశేషమన్నారు. జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డిలు మాట్లాడుతూ కడప నగరంలో ఉత్తమ వైద్యం ఈ హాస్పిటల్‌లో అందుబాటులో ఉండడం సంతోషదాయకమన్నారు. ప్రముఖ వైద్యులు వంశీధర్, విద్యాధర్, వింధ్య, ప్రశాంతి మాట్లాడుతూ తమ హాస్పిటల్ ఊపిరితిత్తుల విభాగంలో అలర్జీ, ఆస్తమా, అడ్వాన్స్‌డ్ బ్రాంకో స్కోపీ ఇంకా దాదాపు అన్ని ఆరోగ్య సమస్యలకు అధునాతన వైద్యసదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



పులివెందుల టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. పులివెందుల పట్టణంలోని రాజా నిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రతి ఒక్కరిని అలరించాయి. ముఖ్యంగా కాంతారా మూవీలోని పాటకు వేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, శిల్పారామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూమి రక్షణ బాధ్యత మనదే



పర్యావరణ మిత్ర సమూహం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



లోగో ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప కల్చరల్: భూమిని రక్షించుకునే బాధ్యత మనందరిపైన ఉందని పలువురు వక్తలు అన్నారు. శనివారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మిత్ర సమూహం సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. నగర పాలక మెయిన్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి ఆపాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు, పర్యావరణ సంస్థల ప్రతినిధులు కృష్ణా సర్కిల్ ఏడురోడ్ల మీదుగా పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఇంటాక్ కార్యాలయంలో సంస్థ పూర్వ కన్వీనర్ ఇలియాస్‌రెడ్డి పర్యావరణం , రక్షణ గురించి సోదాహరణంగా మాట్లాడారు. పర్యావరణ మిత్ర సమూహం ప్రతినిధులు ఎం. ప్రసాద్‌రెడ్డి, బి.భరత్ కుమార్, జీవీ సాయిప్రసాద్‌లు మాట్లాడుతూ పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి రక్షణ కల్పించేందుకు ప్రకృతిపై ప్రేమను పెంచేందుకు ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. జీవ వైవిధ్యమండలి ప్రతినిధి శివారెడ్డి, బయోడైవర్సిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ దినకర్ ఎల్ఐసీ డెవలప్ మెంట్ అధికారి కుమారస్వామి, పర్యావరణ రక్షణపై ఆసక్తి గల వారు తమ సంస్థలో పేర్లునమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటి చెట్టుగా పెంచాలని కోరారు. ఇంటాక్ కోకన్వీనర్ సుబ్బారెడ్డి, లయన్స్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్ రంగనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కడప నగరాన్ని నీమ్ సిటీగా మార్చేందుకు విరివిగా వేప మొక్కలు నాటాలని, 62815 60089 నెంబర్‌కు ఫోన్ చేస్తే మీవద్దకు వేప మొక్కలను చేరుస్తామన్నారు. నగరపాలక సంస్థ హార్టి కల్చర్ ఏడీ అనిల్ కుమార్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఇంట మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణ సంస్థల ప్రతనిధులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి పాటుపడాలి

కడప ఎడ్యుకేషన్: ప్రకృతిని ప్రేమిస్తూ జీవ వైవిధ్యానికి పాటుపడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా శనివారం డీఈఓ రాఘవరెడ్డి సేవ్ సోల్ అనే టీషర్టు లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థులకు జీవ వైవిధ్యంపై అవగాహక కల్పించాలన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ ఎక్కడో ఒక చోట ఒక మొక్కను నాటాలని కోరారు. అనంతరం జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డిని డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు.

విద్యుత్ అంతరాయం అరికట్టండి

– ఈస్ట్ రూరల్ పరిధిలో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం

– సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఈస్ట్ రూరల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు తరచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గాలి వీచినా, ఉరుములు ఉరిమినా, వర్షం వచ్చినా కరెంటు పోయిందంటే ఒక పట్టాన రావడం లేదు. మారుమూల ప్రదేశాల్లోనే కరెంటు పోతే గంట లేదా రెండు గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇండస్ట్రీలు, వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్న చిన్నచౌకు, రామాంజనేయపురం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సెంట్రల్‌జైలు తదితర ప్రాంతాల్లో పదే పదే విద్యుత్ సరఫరా బంద్ కావడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజుల క్రితం ఇలాగే సాయంత్రం 8 గంటలకు కరెంటు పోతే 12 గంటలు దాటినా కరెంటు రాలేదు. తాజాగా ఈనెల 21వ తేది సాయంత్రం గాలి,వాన రావడంతో కరెంటు పోవడంతో అదే పరిస్థితి పునరావృతమైంది. అసలే పరీక్షల కాలం....పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి ఈ నేపథ్యంలో ఇన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో ఇళ్లలో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఊపిరాడక అల్లాడిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



జర్నలిస్టు కాలనీలో ఒరిగిన విద్యుత్ స్తంభం

కరెంట్ కోతలను నివారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: సమయపాలన లేకుండా పోతున్న విద్యుత్ కోతలను నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ కోతలకు సమయపాలన లేకుండా పోయిందని రాత్రి పూట గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడం ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఒక వైపు విద్యార్థులకు పరీక్షల సమయంతో పాటు ఉష్ణోగ్రత 40 డిగ్రీలు ఉన్నప్పటికి రాత్రి పూట గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రశేఖర్, వేణుగోపాల్, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండవ శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం , అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన కడప రాయుడిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్, మయూరం కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.



వైభవంగా నవగ్రహ చండీహోమం

సిద్దవటం : బంగారుపేట గ్రామ శివారులో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం అమ్మవారికి వేద పండితులు నవగ్రహ చండీహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యల ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతి హోమం, రుద్రస్వాహాకార హోమం, లక్ష్మీ సహస్ర నామ హోమం, సర్వతోభద్ర మండల హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణం, మంగళహారతి, మంత్రపుష్పం చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు లక్ష్మిచెన్నకేశవస్వామి వార్షికోత్సవం

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరు గ్రామంలో వెలసిన లక్ష్మిచెన్నకేశవస్వామి 32వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రి 7గంటలకు స్వామి వారికి ఉయ్యాల సేవ, 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం గంగాధర్ బృందంచే చెక్క భజన నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. అలాగే పాల పండ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ. 30,1016, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతుల ను దాతల ద్వారా అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆలయ చరిత్ర :

మండలంలోని సంబటూరులో వెలసిన లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయం మహాభారత కాలం నాటి అభిమన్యుని మనవడైన జనమేజయ మహారాజు నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. కాలయానంలో ఈ ఆలయం వివిధ రకాలుగా తన రూపు రేఖలను మార్చుకుంటూ పునరుద్ధరణ జరుగుతూ వచ్చింది. చోళ రాజుల కాలంలో కూడా ఈ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది. ఈ గ్రామానికి శ్రీ భాష్యపుర అగ్రహారము అని మరొక నామము కలదు. దాదాపు 550 సంవత్సరాల క్రితం ఈ ఆలయ వైభవం గూర్చి శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించి పలు కీర్తనలు రచించారు. అందులోనిదే 'చక్కని ఈ చెన్నుడు సంబటూరి చెన్నుడు' కీర్తన.

విజయనగర ప్రభువైన శ్రీ సదాశివదేవరాయలకు సంతానం లేక బాధపడుతున్నపుడు ఒక రోజు చెన్నకేశవస్వామి రాజుకు కలలో కనిపించి సంబటూరు గ్రామంలో వెలసిన నా దేవాలయాన్ని పునర్నిర్మాణం చేస్తే నీకు సంతానం కలుగుతుందని స్వామి చెప్పగా 1473లో ఈ ఆలయాన్ని పునరుద్ధరణ చేసినట్లు శాసన ఆధారాలున్నాయి. ఆనాటి నుంచి దాదాపు 100 సంవత్సరాల క్రితం వరకు ఏడాదికి రెండు సార్లు మహా వైభవంగా ఉత్సవాలు జరిగేవి. తరువాత పూర్వ వైభవాన్ని సంతరించుటకై 1992 మే 3వ తేదీన ధ్వజ స్థంబ పునఃప్రతిష్ఠ జరిగింది. 1992 నుంచి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి మహోత్సవాలు ఈ నాటికి ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ నాడు (పుష్పగిరి తిరునాల రోజు) జరుగుచున్నవి. ప్రస్తుతం ఆలయం పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. నాటికి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని ఇలవేల్పుగా కొలిచే భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తలనీలాలను సమర్పించు కుంటున్నారు.



సంబటూరులోని లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయం

అభివృద్ధిలో కొత్త పుంతలు

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని పిస్తేనే ఇళ్లకు జగనన్న స్టిక్కర్ అతికించుకోవాలని, ఇందులో బలవంతమేమీ లేదని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు పట్టణంలోని చాకలి వీధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ ఇప్పటి వరకు రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి వివిధ పథకాల ద్వారా రూ.2లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారని తెలిపారు. అందుకే నేడు ప్రతి ఇంటి యజమాని మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను సంతోషంగా తమ ఇంటికి అతికించమని కోరుతున్నారని తెలిపారు.

పరుగులు పెట్టనున్న మున్సిపాలిటీ అభివృద్ధి

మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పరుగులు పెట్టనుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని గ్రామాల్లో ఎప్పుడో పాతికేళ్ల కిందట రోడ్లు వేశారన్నారు. ఇప్పుడు తాము రూ.19 కోట్లతో బీటీ రోడ్లు, రూ.16 కోట్లతో డ్రెయిన్స్ నిర్మించనున్నామన్నారు. టీడీపీ హయాంలో పీహెచ్‌సీ మాత్రమే ఉండేదని, తాము 30 పడకల ఆస్పత్రిగా మార్చి, ప్రస్తుతం వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజికి ఐదు ఎకరాల్లో రూ.11 కోట్లతో సొంత భవనాలను నిర్మించనున్నామని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ, రాయలసీమలో ఎక్కడా లేని విధంగా ఆరు బ్రాంచిలతో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.